





**Published By**
**Chalapaka Prakash**
1-4/3-36, Sanjay Gandhi Colony,
Vidyadharapuram,
VIJAYAWADA-520012 AP.
cell no.9247475975
email: chalapaka@gmail.com

ఒక మహోపద్రవాన్ని ఒక విస్తృతమైన కవితా ప్రక్రియలో చిత్రించిన సంపుటి ఈ 'కరోనా నానీలు'. కరోనా కల్లోలం భూగోళాన్ని గుప్పెట్లో బిగించి గడగడలాడిస్తున్న గత రెండేళ్ళలో, ఈ మహమ్మారి గురించి అనేక భాషల్లో అనేక సాహిత్యప్రక్రియల్లో రచనలు అసంఖ్యాకంగా వెలువడ్డాయి. తెలుగులో కూడా కరోనా గురించిన కథలు, వ్యాసాలు, విశ్లేషణలు, కవితలు అనేకం ప్రచురించబడ్డాయి. నానీలు ప్రక్రియలో కూడా కరోనా చేస్తున్న విలయతాండవం గురించి ప్రముఖకవి ఎన్.గోపి కోవిడ్ వచ్చిన తొలినాళ్ళలోనే "ప్రపంచీకరోనా" పేరుతో కవితా సంపుటి వెలువరించారు. వంగల హర్షవర్ధన్‌గారు కూడా "కోవిడ్ నానీలు" అనే సంపుటాన్ని వెలువరించారు. ఆ కోవలోనే చలపాక ప్రకాష్‌గారు ప్రచురించిన కవితాసంపుటి ఈ 'కరోనా నానీలు". రచయిత చలపాక ప్రకాష్‌గారు కవిగానే కాక, నానీల ప్రవర్తకుడిగా, నానీల పరిశోధకుడిగా చిరకాలంగా సాహిత్యసేవ చేస్తున్నారు. పుస్తకం శీర్షికే ఈ సంపుటిలోని అంశం గురించి తేటతెల్లం చేస్తోంది. ఈ నానీల్లో కవి చలపాక ప్రకాష్‌గారు, కరోనా ప్రళయం ఈ సమాజం మీద చూపించిన, చూపిస్తున్న ప్రభావాన్ని అన్నికోణాల్లో వ్యక్తపరుస్తూ ఈ నానీలను కూర్చారు. జనజీవితాలు అతలాకుతలమవడం, ప్రపంచ ఆర్థికవ్యవస్థ కుప్పకూలడం, మానవసంబంధాలు, కుటుంబ అనుబంధాల్లో కలిగిన అల్లకల్లోలం - ఇలాంటి వాటన్నింటినీ ఎంతో ఆర్ద్రంగా ఈ నానీల్లో చిత్రీకరించారు. మచ్చుకి కొన్ని నానీలు - ఈ వీధిన వెళ్ళిన / అంబులెన్స్/ తిరిగి వస్తుందేమిటి / మహాప్రస్థానమై! ; 'శవాల కుప్పల్లో/ శత్రువులు, మిత్రులూ/ భూదేవికి/ అందరో ఒక్కటే!; 'గృహమే కదా / స్వర్గసీమ!/ లాక్ డౌన్ లో గాని / తెలిసి రాలేదు' ; 'నోరుంది కదాని / అరిచోటోళ్ళకి / ఇప్పుడు వచ్చింది / మాస్క్ అనే తాళం'.. ఇలా. అందరికీ తెల్సిన, ఈ రోజుల్లో అందరూ వింటున్న అంశాలే ఐనా చలపాక ప్రకాష్ గారు వాటిని నానీల్లో చిత్రించిన విధానం కొత్తకోణాల్లో వాటిని మనముందుంచింది. మనసుల్ని కదిలించేలా రూపొందిన ఈ నానీలు ఆకర్షణీయంగా పాఠకుల ముందుకి వచ్చాయి. ఒక్కో నానీకి సందర్భానుసారం చేర్చిన చిత్రాలు కూడా, నానీలోని భావానికి మరింత రసస్పర్శను జతచేసింది. ఓ భయంకరమైన వాస్తవాన్ని హృదయాలను కదిలించేలా పాఠకులకు అందించడంలో రచయిత చలపాక ప్రకాష్‌గారు నూరుశాతం విజయం సాధించారనడంలో సందేహం లేదు. ★★★



# పుస్తక పరిచయం




For Copies :
Rodda UshaSurendra
#507, Garuda Gateway Apartment,
Upparapalli Checkpost,
Tirupati,
Chittoor(Dist.), A.P.
Cell : 94915 23570

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**

"సాహిత్యం ఊపిరి / పోస్తున్నంత కాలం నేను సజీవిని / అక్షరాలు కురిపించే కలం నుండి/ మధురాక్షరాలు ఒలికించాలనే నా తపన" అని విశ్వసించి, అదే మార్గంలో కవితా సృజనచేస్తున్న కవి సురేంద్ర రొడ్డగారు. ఎమ్.ఎ, బి.ఇడి పూర్తిచేసిన సురేంద్రగారు వృత్తి రీత్యా ప్రభుత్వోద్యోగి. ప్రవృత్తి రీత్యా కవి, రచయిత. ఈ "భావతరంగాలు" కంటే ముందు "నాన్న పచ్చి అబద్ధాలకోరు" అనే కవితాసంపుటిని ప్రచురించారు. మొదటి పుస్తకానికే మూడు పురస్కారాలు పొందారు. గిడుగు రామమూర్తి పురస్కారం, సుందరాచారి పురస్కారం, కుప్పం రెడ్డెమ్మ పురస్కారాలతో బాటు కవిశేష్ఠ, సహస్ర కవిమిత్ర అనే బిరుదులు కూడా సురేంద్రగారి సొంతం. ఈ "భావ తరంగాలు" కవితలూ, కవితా చరణాలూ, మినీ కవితలూ కూడా. ఒక్కో కవితకూ విడిగా శీర్షిక ఉండదు. అన్నీ కలిస్తేనే "భావతరంగాలు". మొదటి తరంగంలోనే "ఒక క్షణం / నిను చూసిన నేరానికి / నా జీవితంలో / మిగిలిన క్షణాలన్నింటినీ / దోచేశావే" అంటూ తనలోని కవితా విహంగానికి రెక్కలు తొడిగారు సురేంద్రగారు. "నీ కాలి మువ్వనై / దారి చూపనా / నా గుండె గూటికి" కాలి మువ్వ దారి చూపడమనేది సరికొత్త భావన.

కవిత నిడివి నాలుగు పంక్తులే ఐనా అందులో పొదిగిన భావాలు ఎంతో సాంద్రతరంగా మనసుల్ని తాకుతాయి.

"నా కంఠంలో / ప్రాణం ఉండగా / నీ కంటిలో కన్నీరు రాదు / నీ కంటిలో / కన్నీరు వచ్చిన క్షణం / నా కంఠంలో ప్రాణం ఉండదు"

కొన్ని కవితలు సుదీర్ఘ వాక్యాన్ని ముక్కలు చేసినట్లనిపించినా అందులో కవి చెప్పదలచుకున్న భావన సున్నితంగా ఉంటుంది.

"నీ మీద నాకున్నది / ప్రేమా / కామమా / స్నేహమా / వేదాంతమా / నాకు తెలియదు కానీ / నీవంటే నాకు ప్రాణమే"

సురేంద్రగారి శైలి గురించి ముందు మాటలో డా.కంపెల్ల రవిచంద్రన్‌గారు ఇలా వ్రాశారు "వ్యాకరణాన్ని తోసిపుచ్చాడు, చందస్సుని విసిరేశాడు.. నిఘంటువుల్ని తోసేశాడు. వాక్యంలోని కర్త క్రియలకు విడాకులిచ్చాడు. పద్యాల నడుముల్ని నిర్దయగా విరగదన్నాడు. మూలిగే సాంప్రదాయాలకు తిలోదకాలిచ్చి తనదైన నవీన పంథాను అనుసరించాడు" అని.

నూటయాభై పేజీల ప్రేమ 'భావతరంగాలు' లో ఓలలాడానికి ఈ కవితాస్రవంతిని సందర్శించవచ్చు. ★★★